క్లుప్తంగా

ఆక్వా రైతులకు శిక్షణ తరగతుల ప్రారంభం



కోడూరు: ఆక్వా రైతులు రొయ్యలు, చేపల సాగులో మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటు విభిన్న జాతుల పెంపకంపై అవగాహన పెంచుకోవాలని నాక్సా ఎంపెడా కాకినాడ సంస్థ స్టేట్ కో–ఆర్డినేటర్ కిరణ్ కుమార్ అన్నారు. నాక్సా సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ కులానికి చెందిన ఆక్వా రైతులకు ఆక్వా కల్చర్‌లో అనుసరించాల్సిన విధానాలను వివరిస్తూ మూడు రోజుల శిక్షణా తరగతులను సోమవారం స్థానిక తొమ్మిదవ వార్డులోని అంబేడ్కర్ భవనంలో ప్రారంభించారు. రొయ్య పిల్లలు ఎంపిక నుంచి సాగులో అనుసరించాల్సిన విధివిధానాలపై రైతులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కిరణ్‌కుమార్ తెలిపారు. చెరువుల్లో నీటి శాతాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. రొయ్య పిల్లలకు అందిస్తున్న ఆక్సిజన్ శాతాన్ని పరికరాల ద్వారా తెలుసుకోవాలన్నారు. మేత యాజమాన్య పద్ధతులు, రొయ్య పిల్లల పెంపకం అంశాలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఫీల్డ్ మేనేజర్ రవికుమార్, మత్స్యకార అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో హుండీ కానుకల లెక్కింపు



నడకుదురు(చల్లపల్లి): గ్రామంలోని ప్రాచీన దేవాలయం శ్రీ పృథ్వీశ్వర స్వామి దేవస్థానంలో హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. దేవదాయ శాఖ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసు, పర్యవేక్షణ అధికారి ఘంటసాల శ్రీనివాసరావు సమక్షంలో దేవదాయ శాఖ సిబ్బంది, వేద పండితులు హుండీ తెరిచారు. రెండు నెలల కాలానికి రూ.26,488లు ఆదాయం లభించింది. ఆలయ సమగ్ర అభివృద్ధి కర్త మండవ రవీంద్ర, సర్పంచ్ గొరిపర్తి సురేష్ బాబు, మల్లుపెద్ది త్రివిక్రమరావు, అర్చకులు పాల్గొన్నారు.

జలదీశ్వరాలయం హుండీ ఆదాయం రూ.83,928

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల జలదీశ్వరాలయం హుండీ కానుకల ఆదాయం రూ.83,928 వచ్చిందని ఆలయ ఈఓ యార్లగడ్డ వాసు తెలిపారు. ఆరునెలల కాలానికి సంబంధించి సోమవారం ఆలయ ప్రాంగణంలో హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. మచిలీపట్నం నాగేంద్రస్వామి ఆలయ ఈఓ ఘంటసాల శ్రీనివాస్, వేమూరి ప్రవీణ్, అర్చకులు పాల్గొన్నారు.

ప్రొక్యూర్‌మెంట్ ఐటమ్స్‌కు దరఖాస్తుల స్వీకరణ



మోపిదేవి: మోపిదేవి, మచిలీపట్నం ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఎస్ పాఠశాలలకు పలు రకాల ప్రొక్యూర్‌మెంట్స్(వస్తువులు) ఐటమ్స్ సరఫరా నిమిత్తం సీల్డ్ కం టెండర్ దరఖాస్తులు సోమవారం స్వీకరించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీరరవి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు పలురకాల వస్తువులు సరఫరాకు టెండర్స్ ఆహ్వానించిందన్నారు. అందులో భాగంగా మోపిదేవి గురుకులానికి కూరగాయలు–2, కోడిగుడ్లు–2, పండ్లు–2, చికెన్–4 మొత్తం 10 దరఖాస్తులు మచిలీపట్నం గురుకుల పాఠశాలకు కూరగాయలు–4, కోడిగుడ్లు–1, పండ్లు–4, చికెన్–3 మొత్తం 12 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ సీల్డ్ టెండర్స్‌ను మచిలీపట్నంలో ఆర్డీఓ సమక్షంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు టెండర్‌దారుల సమక్షంలో ఓపెన్ చేసి టెండర్స్ ఖరారు చేస్తారన్నారు.

విద్యార్థికి రూ.25 వేలు ఆర్థికసాయం



పెదప్రోలు(మోపిదేవి): ఉత్తమ ప్రతిభతో మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు సాధించిన విద్యార్థి మహేశ్వర ప్రసాద్‌కు కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.25 వేలను పాలకేంద్రం అధ్యక్షుడు నాదెళ్ల భవాని శంకరప్రసాద్ సోమవారం సాయంత్రం అందజేశారు. పెదప్రోలు పాలకేంద్రం సంఘ సభ్యులు జన్ను నరసింహారావు కుమారుడికి ప్రతిభ పథకం కింద రూ.25 వేలు చెక్కు అందించారు. కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా బోర్డు డైరెక్టర్ వేమూరి సాయి వెంకట రమణ, పామర్రు పాలశీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్, రూట్ ఏఎంపీఓ మోర్ల వరప్రసాద్, సంఘ పాలక వర్గ సభ్యుడు వై.రాంబాబు, సంఘ సిబ్బంది డొక్కు చినఅర్జునరావు, క్లోపల్లి రాము, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో చేరువైన పాలన



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ భారతి, కార్పొరేటర్ సాయిబాబు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) అన్నారు. నగరంలోని 46వ డివిజన్ సచివాలయాన్ని ఈడేపల్లిలోని ప్రభుత్వ భవనాల్లోకి మార్చారు. ఈ సచివాలయాన్ని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి పేర్ని కిట్టు ప్రారంభించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ.. గతంలో ఏ పని కావాలన్నా ప్రజలు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. వెళ్లినా వెంటనే పనవుతుందనే నమ్మకం ఉండేది కాదన్నారు. అలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను అమలులోకి తీసుకువచ్చారని చెప్పారు. దీంతో ప్రజలకు అవసరమైన ప్రతి పని సచివాలయంలోనే పూర్తవుతుందని దీంతో ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా కూడా ప్రజలు ఎంతో మేలు పొందారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు చేర్పులు, మార్పులు వంటి పనులు ఉచితంగా చేయటం జరిగిందన్నారు.

ప్రజలకు సులువుగా సేవలు

మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ.. అద్దె భవనంలో తాత్కాలికంగా నిర్వహించబడిన 46వ డివిజన్ సచివాలయానికి ప్రభుత్వ భవనాన్ని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) సమకూర్చారన్నారు. దీంతో ఈ భవనంలో ప్రతి సెక్రటరీకి ఒక గదిని కేటాయించామన్నారు. ప్రజలకు ఇక్కడ సులువుగా సేవలు అందుతున్నాయని చెప్పారు. డిప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ డిప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత, లంకా సూరిబాబు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడవల్లి నాగరాజు, కార్పొరేటర్లు భోగాధి సాయిబాబు, మస్నే శారదా, మిరియాల నాగబసవపూర్ణ, జోగి చిరంజీవి, యండ్రపాటి నాగేశ్వరరావు, ఐనం తాతారావు, పల్లి శేఖర్, పర్ణం సతీష్, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్‌నోబుల్, బూరగ రామారావు, శ్రీకాకోళపు నరసింహగుప్తా, చిత్తజల్లు రాజు పాల్గొన్నారు.

పాలకేంద్ర భవనం ప్రారంభం



పాల కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక తదితరులు

పెడన: మండల పరిధిలోని కూడూరు పంచాయతీ కృష్ణాపురం పాల ఉత్పత్తిదారుల అసోసియేషన్ నూతనంగా నిర్మించిన పాలకేంద్ర భవనాన్ని కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ప్రారంభించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుతో సోమవారం ప్రారంభించిన ఈ కార్యక్రమంలో హారిక మాట్లాడుతూ.. సొంత భవనం ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. ఆంజనేయులు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. పశువులకు మంచి పోషక విలువలు కలిగిన పశు దాణాను, మేలు జాతి వీర్యంను, ఉచిత డివార్మింగ్ మందులను, అత్యవసర సంచార పశు వైద్య సేవలు అందించడంతో పాటు క్షీర బంధు, కల్యాణమస్తు, ప్రతిభ వంటి పథకాలను ప్రవేశ పెట్టి అందిస్తున్నామని చెప్పారు. ఉప్పాల రాము, జిల్లా పాలక వర్గ సభ్యులు, పెడన జెడ్పీటీసీ సభ్యులు అర్జా వెంకట నగేష్, పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, కూడూరు గ్రామ సర్పంచ్ కాగిత విజయలక్ష్మి, అసోసియేషన్ అధ్యక్షుడు వేముల వీర వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ బసవరాజు కుమార్, వేతన కార్యదర్శి ఉప్పాల నాగవేణురావు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు. అనంతరం ఆంజనేయులు, సభ్యులు నడుపూరు పంచాయతీ నేరికేపాలెం పాల ఉత్పత్తిదారుల అసోసియేషన్‌ను సందర్శించారు. పాల ఉత్పత్తిదారులకు మేలైన యాజమాన్య పద్ధతులు, మెరుగైన పశుపోషణకు పలు సూచనలు చేశారు.

ఉద్యోగులు విధులను బాధ్యతగా నిర్వర్తించాలి



ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ అశోక్

మోపిదేవి: గ్రామ సచివాలయ ఉద్యోగులు తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ఈఓపీఆర్డీ అశోక్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయ, గ్రామ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ ప్రభుత్వం అధికారులకు కేటాయించిన అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీలో నగదు రహిత విధానంపై పూర్తిస్థాయిలో వివరించారు. ఇంటి పన్ను తదితర ట్యాక్స్‌లను ఈ పోస్ మిషన్ ద్వారా మాత్రమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అతి త్వరలో వస్తాయని తెలిపారు. గ్రామ పంచాయతీల పేరిట హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో తెరచిన ఖాతాలో నగదు జమ అవుతాయన్నారు.

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలు, మంచినీరు అందించే విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం విషయంలో తగు జాగ్రత్తలు, ఇంటి పన్ను డిమాండ్ నోటీసులలో మార్పులు, చేర్పులు బిల్లుల తయారీ వంటి వాటిపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ పేర్ని మాధవేంద్రరావు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాల స్వీకరణ



అధికారులు, రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరమణ

చిలకలపూడి(మచిలీపట్నం): పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌కు సంబంధించి ప్రతిపాదనలను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ కోరారు. ఆయన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ.. జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రతిపాదనల జాబితా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశామన్నారు. రాబోయే సాధారణ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో బందరు ఇన్‌చార్జి ఆర్డీఓ డి.శివనారాయణరెడ్డి, ఉయ్యూరు ఆర్డీఓ కె.విజయకుమార్, ఎంయూడీఏ వీసీ కె.రాజ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జి.చంద్రయ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు గూడవల్లి నాగరాజు, గాజుల భగవాన్, లింగం ఫిలిప్, చంద్రశేఖర్, కొడాలి శర్మ, వంపుగడవల చౌదరి పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని 30 మంది మహిళలు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయ అర్చకులు నరసింహస్వామి పూజా కార్యక్రమాలు జరిపారు. ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు దంపతులు వ్రతంలో పాల్గొన్న భక్తులకు పూజా సామగ్రిని అందజేశారు.

అన్నదాతల సంక్షేమానికి కృషి

చల్లపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాటలో రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు(ఫణి) తెలిపారు. స్థానిక పీఏసీఎస్ ప్రాంగణంలో మహాజన సభ సోమవారం నిర్వహించారు. 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాలకు గాను సంఘ సభ్య రైతులకు 12.5 శాతం రూ.15,24,882లు డివిడెంట్లు రూపంలో పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో పర్సన్లు వేముల ఏడుకొండలు, కొలుసు సుబ్బారావు, సొసైటీ సీఈఓ తోట కృష్ణారావు పాల్గొన్నారు.

సీఐ రవికుమార్‌కు సన్మానం

చల్లపల్లి: చల్లపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించి బదిలీ అయిన బి.భీమేశ్వర రవికుమార్‌ను ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు సత్కరించారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సత్కరించి సీఐ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో చింతల శ్రీనివాసరావు, కె.వీరాంజనేయులు, మద్దాల వెంకటేశ్వరరావు, సరళ పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తగా భోగాది ప్రమాణ స్వీకారం



విశ్వేశ్వరరావుతో ప్రమాణం చేయిస్తున్న ఈఓ పామర్తి

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని పురాతనమైన శ్రీదేవి–భూదేవి సమేత శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణ స్వామి దేవస్థానం 10వ వంశపారంపర్య ధర్మకర్తగా భోగాది విశ్వేశ్వరరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు ఈ నియామకం జరిగిందని ఈఓ చెప్పారు. అసెంబ్లీ సమావేశాల కారణంగా ఎమ్మెల్యే రమేష్‌బాబు హాజరు కాలేదని స్థానిక నాయకులు తెలిపారు. నాగాయలంక జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు(చంటి), మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పరిశె అమ్మన్న, డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, తోట కృష్ణ, భోగాది వంశ పారంపర్య కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు. విశ్వేశ్వరరావును జెడ్పీటీసీ మోకా, పీఏసీఎస్ అధ్యక్షుడు చంటి, ఈఓ లతో పాటు పలువురు సన్మానించారు.

ఆదర్శప్రాయుడు పాండురంగారావు



పాండురంగారావు దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

గూడూరు: భావిభారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘకాలం పనిచేయడమే కాకుండా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ప్రభుత్వ పురస్కారం అందుకున్న వి.పాండురంగారావు ఆదర్శ ప్రాయుడని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు అన్నారు. మండలంలోని మల్లవోలు జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీవిరమణ చేసిన పాండురంగారావు అభినందన సభ సోమవారం పాఠశాలలో నిర్వహించారు. సురేష్ రంగబాబు మాట్లాడుతూ.. మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిన ఘనత పాండురంగారావుకే దక్కుతుందన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడమే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కళల్లోనూ రాణించేలా ప్రోత్సాహించారన్నారు. గ్రామస్తుల సహకారంతో పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన పాండురంగారావు శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, సర్పంచ్ బొర్రా సాంబశివయ్య, నాయకులు పర్ణం పెదబాబు, మోటేపల్లి రత్నారావు, పీఏసీఎస్ చైర్మన్ దాసరి రమేష్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ నరసింహారావు, వైస్ చైర్మన్ ప్రశాంతి, హెచ్‌ఎం అరుణ, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీని లాభాల బాటలో నడిపించేందుకు కృషి



అవనిగడ్డ: ఘంటసాల మార్కెట్‌యార్డు కమిటీని లాభాల బాటలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానని యార్డు చైర్మన్ వేమూరి వెంకట్రావ్ చెప్పారు. కొడాలి మార్కెట్ యార్డు ప్రాంగణంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకట్రావ్ మాట్లాడుతూ.. రైతులకు ఉపయోగపడే డొంక రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ కమిటీ ఆదాయం పెంపొందించేందుకు శాయశక్తులా పనిచేస్తానని చెప్పారు. సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవ సామాజిక బాధ్యత

గుడివాడటౌన్: సమాజ సేవ పౌరుల సామాజిక బాధ్యతని ఏఎన్నార్ కళాశాల కరస్పాండెంట్ కె.ఎస్.అప్పారావు అన్నారు. ఏఎన్నార్ కళాశాల ప్రాంగణంలో సోమవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం చేశారు. కళాశాల ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి కొత్తగా మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్లు జేసుబాబు, ఎ.గ్రీష్మ, గ్రంథాలయ అధికారి పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యం నంబర్‌వన్



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కళ్యాణి

చల్లపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య వ్యవస్థ నంబర్‌వన్ స్థానంలో ఉందని జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి అన్నారు. స్థానిక కస్తూర్బా మెమోరియల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయుష్మాన్ భవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాలల్లో గత ప్రభుత్వాల కంటే మెరుగైన వైద్య సేవలు, వైద్య పరికరాలు సమకూరాయన్నారు. పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి డబ్బు వృథా చేసుకోకుండా ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ అబ్దుల్ కరీం, వైఎస్సార్ సీపీ నాయకులు రాజులపాటి శివప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జ్ఞానరత్న, వైద్యులు పాల్గొన్నారు.

శోభాయమానంగా సంపూర్ణ భగవద్గీత పారాయణం



సంపూర్ణ భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

నాగాయలంక: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగాయలంక ప్రసన్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మండల శ్రీదత్త భక్తబృందం సహకారంతో 108 మంది గణపతి సచ్చిదానంద స్వామీజీ శిష్యులచే సోమవారం సంపూర్ణ భగవద్గీత పారాయణం శోభాయమానంగా నిర్వహించారు. తొలుత స్థానిక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం, దేవస్థానం కమిటీ అధ్యక్షుడు మండవ బాలవర్ధిరావు, డాక్టర్ ఏవీఎల్ నారాయణ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. వినాయక వేదికపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడు ప్రతిమలకు చిట్టా హరేకృష్ణ, వాణి దంపతులచే సాయికిరణ్‌శర్మ(కౌశిక్) బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు జరిపారు. తదుపరి ఉత్సవ పందిరిలో ఆశీనులైన 108 మంది భక్తులు ఆధ్యాత్మిక శోభతో భగవద్గీత సామూహిక సంపూర్ణ పారాయణం చేశారు. పారాయణం అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ జరిగింది. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో నిత్య కార్యక్రమాలలో భాగంగా సాయి కిరణ్‌శర్మ(కౌశిక్) బ్రహ్మత్వంలో కొల్లూరు రఘురామ్, నాగమణి దంపతులచే ప్రసన్న గణపతి సన్నిధిలో, తదుపరి ఉత్సవ విగ్రహ వేదికపై పూజలు జరిగాయి. భీమవరానికి చెందిన రావదార మోహనరావు(యుగంధర్) ఆర్థిక సౌజన్యంతో మొగిలిచర్ల నాగమణి(తెనాలి) భాగవతార్‌చే శ్రీకృష్ణరాయభారం హరికథా గానం జరిగింది. విద్వాన్ బ్రహ్మశ్రీ పాపర్తి ఆంజనేయులు(అవనిగడ్డ) వయోలిన్, విద్వాన్ ఎం.నగధరరావు(తెనాలి) మృదంగ సహకారం అందించారు.

వైభవంగా గణపతికి పూజలు



బైపాస్‌రోడ్డులోని బ్రహ్మంగారి మఠం వద్ద చీరలతో గణనాథునికి అలంకారం



పెదతుమ్మిడిలో నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుడు



అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి తదితరులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని గణేష్ నవరాత్రి ఉత్సవాల పందిళ్ల వద్ద పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పందిళ్లలోని స్వామివారి విగ్రహాల వద్ద పలు అలంకారాలు ఆకర్షణీయంగా చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పందిళ్ల వద్దకు భక్తులు చేరుకుని పూజలు చేశారు. బుధవారం నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని పందిరి వద్ద మంగళవారం అన్నసమారాధన నిర్వహించనున్నారు.

బంటుమిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక ప్రతిమలను సుందరంగా అలంకరించిన వాహనాలపై ఉంచి మేళతాళాలు, కనకతప్పెట్లతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. డప్పు కళాకారులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులు వార్పు పోసి హారతులు ఇచ్చి పూజలు చేశారు. పెదతుమ్మిడి, జానకీరామపురం, నాగేశ్వరరావుపేట రోడ్డు తదితర ప్రాంతాల్లోని వినాయక ప్రతిమలకు గ్రామోత్సవం నిర్వహించి బంటుమిల్లి ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు.

పెడన: గణపతి నవరాత్రులు సోమవారంతో ఎనిమిదో రోజుకు చేరాయి. ఆయా కూడళ్లలో పందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం అన్న సమారాధనలు, నిమజ్జనాలు చేశారు. పట్టణంలోని గూడూరు రోడ్డు ఆటో స్టాండ్ వద్ద జరిగిన అన్న సమారాధనలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, మాజీ చైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి, ఫ్లోర్ లీడర్ బళ్ల గంగయ్య, పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్ తదితరులు అన్న సమారాధన ప్రారంభించారు.

ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించాలి

చల్లపల్లి: దుకాణదారులు కచ్చితంగా ప్లాస్టిక్ కవర్ల నిషేధం పాటించాలని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి తెలిపారు. స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుకాణదారులను కలిసి ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సీసీ రహదారి నిర్మాణ పనుల ప్రారంభం

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధిలోని పాపవినాశనంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్రబాబు సోమవారం ప్రారంభించారు. గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎస్సీ కాలనీలో రహదారుల సమస్యలపై ఎమ్మెల్యే రమేష్‌బాబుకు స్థానికులు వివరించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు రూ.15 లక్షలు మంజూరు చేయగా, సోమవారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కనగాల సుజాత, సురేష్, కొండలు, వసంతరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బంటుమిల్లి: సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ(ఐసీడీఎస్) శాఖ బంటుమిల్లి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీఓ ఎం.సముద్రవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బంటుమిల్లి మండలం అర్తమూరు–1, బంటుమిల్లి కొత్త హరిజనవాడ కేంద్రాల్లో కార్యకర్త పోస్టులకు, కృత్తివెన్ను మండలం యండపల్లి, ఒర్లగొందితిప్ప, ఏటిపవరు, మాట్లం కె.నగర్, కృత్తివెన్ను పల్లెపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆమె తెలిపారు. నియామకాలను రిజర్వేషన్ పద్ధతిలో చేపడతామన్నారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై 21 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాలతో అక్టోబర్ 5వ తేదీ లోపు బంటుమిల్లి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సీడీపీఓ సముద్రవేణి కోరారు. పూర్తి వివరాలకు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

అవనిగడ్డ పరిధిలో రెండు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అవనిగడ్డ: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ పరిధిలో రెండు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ పి.శేషుకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యం అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలు, నాగాయలంక పంచాయతీ పరిధిలోని నాగాయలంక –4 అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ రెండు పోస్టులు జనరల్ అభ్యర్థులకు కేటాయించామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 21 నుంచి 35 సంవత్సరాలు నిండని అభ్యర్థులు అక్టోబర్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.